క్లుప్తంగా

డ్రైవర్లు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి



డ్రైవర్లకు సూచనలిస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి పాలిమేర గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని జిల్లా ప్రజా రవాణాధికారి పాలిమేర గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఫిర్యాదులు వచ్చిన, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ల పనితీరుపైన ఆర్టీసీ అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. ఆర్టీసీ సంస్థకు ప్రమాద రహిత సంస్థగా పేరు ఉందని, అది ఒక్క డ్రైవర్లతోనే సాధ్యమైందన్నారు. ప్రతి డ్రైవరు విధుల్లో ప్రశాంతయుత మనస్సులో ఉండాలని, సకాలంలో ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. అనంతరం బద్వేలు డిపో మేనేజర్ నిరంజన్ డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్ పై సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే బ్లాక్ స్పాట్ పై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అలాగే ఓం శాంతి సంస్థ ఆధ్వర్యంలో మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 24 మంది డ్రైవర్లు, అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ముందస్తు అడ్మిషన్స్ పేరుతో విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర నుండి లక్షల రూపాయలు వసూల్ చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అఖిరా నందన్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్వ్యాప్తంగా చైతన్య ,నారాయణ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్స్ పేరుతో లక్షల రూపాయలు విద్యార్థి తల్లిదండ్రుల నుండి వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు రాజేష్, అరుణ్ పాల్గొన్నారు.

అన్నదానం



కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని ప్రేమాలయ ఆశ్రమంలో దాతలు మంగళవారం అన్నదానం చేశారు. సాంబ జయసింహకుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని తల్లిదండ్రులు అరుణకుమారి, హరిహరకుమార్ తోడ్పాటుతో ఉదయభాస్కర్ ఈ కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: విద్యుత్ భారాలపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి అన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఏపీ ట్రాన్స్ కోకు 2014–19 కాలానికి సంబంధించి రూ.1050 కోట్లకు పైగా మిగులు వచ్చిందన్నారు. ఆ మేరకు ట్రూ డౌన్ ద్వారా వినియోగదారులకు చార్జీలు తగ్గించబోతున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా రూ.15,485 కోట్లు అదనంగా సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, కడప అసెంబ్లీ సమన్వయకర్త బండి జకరయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, చిన్నకుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తం కావాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీ నాయకులు సమాయత్తం కావాలని డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి, నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి జకరయ్య, మహ్మద్ అలీఖాన్ ఖాన్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కమ్మవారిపల్లి, అప్పరాజుపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు ఏఓ ఈశ్వరరెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణలో భాగంగా ప్రతి రైతుకు ఆధార్ కార్డు నెంబరు తరహాలో 14 అంకెల విశిష్ట సంఖ్య ఇవ్వడం జరుగుతోందన్నారు.

అడుగంటిన జలం



జిల్లాలోని కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మ దిన్నె మండల పరిధిలో ఉన్న గుర్రం గుంపు రిజర్వాయర్‌లో జలం అడుగంటుతోంది. దీంతో రిజర్వాయర్ పరిధిలోని రైతాంగంలో ఆందోళన నెలకొంటోంది. వర్షాలు లేకపోవడం.. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ఉన్న నీరు కాస్తా తగ్గుతోంది. ఈ జలాశయం దిగువన పంటలు సాగు చేస్తున్న రైతులు తమ పొలాలలోని బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని వేదన చెందుతున్నారు.

ఎండలో ఉపాధి మార్గం



కలెక్టరేట్‌కు ప్రతి నిత్యం ఎంతో మంది తమ సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారు. అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి.. మా సమస్య తీర్చండి సారూ.. అంటూ వేడుకుంటారు. చదువు రాని వారు ఇదిగో.. ఈ ఎండలో గొడుగు నీడన అర్జీలు రాసే వారి వద్దకు వచ్చి రాయించుకుని వెళతారు. వారు అంతో ఇంతో ఇస్తారు.. మండుటెండను సైతం లెక్కచేయకుండా కూటి కోసం ఇలా గొడుగు నీడన ఎదురుచూసే వారు ఎంతో మంది కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై దర్శనమిస్తారు.

రైతు బజార్.. పసుపుమయం



ఇది కడప నగరంలో ఉన్న రైతు బజార్.. ఇక్కడ ఏర్పాటు చేసిన స్వాగత బోర్డు మొత్తం పసుపు రంగులో దర్శనమిస్తోంది. ప్రభుత్వం మారడంతో మార్కెటింగ్ అధికారులు ఇదిగో ఇలా పసుపు రంగు బోర్డు తయారు చేయించినట్లు తెలుస్తోంది. తెలుగు దేశం పార్టీ నాయకుల మెప్పు కోసమే ఇలాంటి బోర్డు తయారు చేయించారని జోరుగా ప్రచారం జరుగుతోంది.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

విద్యుత్ ప్రమాదాలను నివారించండి

కమలాపురం : రైతులు, ప్రజలు, విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించి విద్యుత్ ప్రమాదాలను నివారించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రమణ తెలిపారు. మంగళవారం పట్టణంలో విద్యుత్ ప్రమాదాలు–నివారణ గురించి ప్రజలకు వీడియో రూపంలో ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించి విద్యుత్ ప్రమాదాలను నివారించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో, పంట పొలాలకు చుట్టూ విద్యుత్ కంచెలను ఏర్పాటు చేయడం వలన వన్య ప్రాణులకు, మనుషులకు ప్రమాదం అన్నారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరం అన్నారు. ఇలాంటి కేసులు నమోదైతే 10 సంవత్సరాల జైలు శిక్ష, తీవ్రమైన జరిమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మోటార్ పంప్ సెట్ యొక్క స్టార్టర్ వద్ద తేమ లేకుండా పొడిగా ఉండేలా చూసుకోవాలన్నారు. స్టార్టర్ ఆన్ లేదా ఆఫ్ చేసే సమయంలో చెప్పులు తొడగడంతో పాటు చేతికి రబ్బరు తొడుగులు ధరించాలన్నారు. మోటార్ పంప్ సెట్‌కు ట్రాన్స్‌ఫార్మర్‌కు మధ్య 20 నుంచి 30 మీటర్ల దూరం ఉండే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని, అలాగే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు పొలంలో కొంత స్థలం కేటాయించి దాని వద్దకు జీవులు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటిలో నిలబడి విద్యుత్ మోటార్లను స్విచ్‌లకు సంబంధించిన పరికరాలను తాకరాదన్నారు. ఈదురు గాలులు, వర్షాల వలన తెగిపడిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉంటూ వాటిని తాకకుండా సంబంధిత అధికారులకు లేదా దగ్గరలోని ఉప కేంద్రాలలో ఉండే సిబ్బందికి తెలియజేసి వారి ద్వారానే మరమ్మతులు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ చాంద్‌బాషా, సబ్ ఇంజినీర్ సాగర్ పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

కమలాపురం : భూ ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల తహసీల్దార్ శివరామిరెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రబల్లె కొత్తపల్లె ఎస్సీ కాలనీకి చెందిన దళితుల భూములు ఆక్రమణకు గురయ్యాయని, వారికి న్యాయం చేయాలని సీపీఐ నాయకులు ఈనెల 16వ తేదీన క్షేత్ర స్థాయిలో పర్యటించి విన్నవించారు. దీనికి స్పందించిన తహసీల్దార్ శివరామిరెడ్డి సోమవారం మండలంలోని ఎర్రబల్లె కొత్తపల్లె ఎస్సీ కాలనీ పర్యటించారు. ఆక్రమణకు గురయ్యాయని ఎస్సీ కాలనీ వాసులు ఆరోపిస్తున్న భూములను ఆయన పరిశీలించారు. ఇరు వర్గాల వారి వద్ద ఉన్న పత్రాలను తీసుకురావాలని సూచించారు. వాటిని పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ / కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పెన్షనర్ల సమస్యలపై ఏర్పాటైన హైపవర్ కమిటీ రిపోర్టును సత్వరమే బహిర్గతం చేసి, కనీస పింఛన్ రూ.9000 అందించేలా చర్యలు చేపట్టాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పెన్షనర్స్ అసోసియేషన్ కేంద్ర కమిటీ పిలుపుమేరకు కడప పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈపీఎస్ పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఎపెన్షనర్స్ సమస్యలపై ఢిల్లీలో గత నెలలో జంతర్ మంతర్ దగ్గర మూడు రోజులపాటు ధర్నా నిర్వహించిన సందర్భంలో కేంద్ర మంత్రి దృష్టికి సమస్యలను తీసుకుపోయామని, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ



పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, పెన్షనర్లు

ఇచ్చారన్నారు. అయితే నేటి వరకు సమస్యలను ఏమాత్రం పరిష్కరించలేదన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి అన్ని వర్గాల ప్రజలపై భారాలు మోపుతున్నాయని, నిత్యావసర వస్తువుల ధరలు మొదలుకొని గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ఈపీఎస్ పెన్షనర్స్‌కు వెయ్యి రూపాయలు పెన్షన్ ఇస్తే ఏ రకంగా బతుకుతారని ప్రశ్నించారు. ధరలు పెంచినపుడు పెన్షన్ పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆరు నెలలకు ఒకసారి డీఏ చెల్లించాలని, కనీస పెన్షన్ రూ. 9000 ఇవ్వాలని, పెన్షన్ దారులకు ఈఎస్ఐ ద్వారా వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. పెన్షనర్స్ సమస్యలపై రానున్న రోజుల్లో ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నాలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు సాంబశివారెడ్డి, హరిచంద్రా రెడ్డి, బ్రహ్మం, కులాయప్ప, నారాయణరెడ్డి, కృష్ణా రెడ్డి, బాలబాయన్న, వెంకటేశ్వర్లు, శివారెడ్డి తోపాటు పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని కడప సైబర్ క్రైమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధు మల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో 'సైబర్ క్రైమ్' పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మధు మల్లేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్‌నెట్ ఆధారంగా జరిగే వ్యక్తిగత, ఆర్థిక, భద్రత పరమైన నేరాలను సైబర్ నేరాలు అంటారన్నారు. ఇంటర్‌నెట్ మాధ్యమం ద్వారా ప్రైవసీని భగ్నం చేయడం, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయడం, భద్రతకు ముప్పు కలిగించడం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఆశ, భయం, అమాయకత్వం వల్ల ఈ సైబర్ నేరాల బారిన పడుతున్నారన్నారు. ఈ నేరాలకు పాల్పడే వారెవరో గుర్తించడం అత్యంత కష్టం అన్నారు. రోజు రోజుకీ నేరాల తీవ్రత ఊహించనంత వేగంగా విస్తరిస్తోందన్నారు. యువతులు తప్పనిసరిగా 'శక్తి' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని తెలిపారు. స్టెప్ సీఈఓ సాయి గ్రేస్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని సమాజంలో చైతన్యం తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెడ్డప్ప, ఎన్ఎస్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధు మల్లేశ్వరరెడ్డి

అధికారి విజయ్ కుమార్, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన వారిని అరెస్ట్ చేయాలి

కడప అర్బన్: జిల్లాలో కస్తూరిబా స్కూళ్లలో, ఆశ్రమ పాఠశాలల్లో సీసీడీవో పోస్టుల పేరుతో నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. ఆరు లక్షలు వసూలు చేసిన రవికుమార్, వలి, మేరీ అనే వాళ్లను అరెస్టు చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను బాధితులతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన జిల్లా కావడం, ఉపాధి లేమి ఉండడంతో చదువుకున్న



ఎస్పీ అశోక్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి

నిరుద్యోగులు ఏదో ఉద్యోగం వస్తుందని ఆశపడితే ఇట్లాంటి ఏజెంట్లు మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్కొక్కరి దగ్గర ఆరు లక్షలు తీసుకొని కస్తూరిబా స్కూల్లో సీసీడీవో పోస్టు ఇస్తున్నట్టు స్కూళ్లలో చేర్పించి నాలుగు నెలలు పని చేయించుకున్న తర్వాత అది నకిలీవని అన్నారు. నకిలీ అపాయింట్‌మెంట్ ఇచ్చినవాళ్లు, డబ్బు వసూలు చేసుకున్న వాళ్లు ప్రశాంతంగా ఉన్నారని, కానీ నిరుద్యోగులు మోసపోయి బాధపడుతున్నారని, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిరుద్యోగులను మోసం చేసిన వారిని శిక్షిస్తామని హామీ ఇచ్చారు.

కడప అభివృద్ధిలో వైఎస్సార్, వైఎస్ జగన్ చెరగని ముద్ర

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ అభివృద్ధిలో దివంగత వైఎస్సార్, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిలు చెరగని ముద్ర వేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్ కుమార్, 40వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి అన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 18తేదికి మూడో పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయ్యిందన్నారు. ఈ నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి పనులకు సహకరించిన నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్‌ఆర్ సీఎం అయ్యాక జిల్లాలో అభివృద్ధిని పరుగులు పెట్టించారని, కడప నగరాన్ని నగరపాలక సంస్థగా మార్చి వేలకోట్లు వెచ్చించి అభివృద్ధిని ఉరకలు పెట్టించార



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్ కుమార్

న్నారు. ఆ తర్వాత వైఎస్ జగన్ సీఎం అయ్యాక మరింత ముందుకు తీసుకుపోయారన్నారు. 3వ సారి పాలకవర్గం ఏర్పడిన తర్వాత వైఎస్ జగన్ చొరవతో రూ.2500కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు పూర్తి చేసుకున్న తర్వాత కూడా అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతూ ఉన్నాయి. ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. పెండింగ్ లో ఉన్న నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, బ్రహ్మంసాగర్ నుంచి వచ్చే మంచినీటి నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని, బుగ్గవంక పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. పెండింగ్ లో ఉన్న రోడ్ల విస్తరణ పనులను పూర్తి చేయాలని కోరారు. అభివృద్ధికి తమ పాలకవర్గం పూర్తిగా సహకరిస్తుందని, రాజకీయాలకు, పార్టీలకు, వర్గాలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి వర కుమార్ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

ఒంటిమిట్ట : పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులపై లైంగిక దాడులు, వేధింపులు, నేరాల నిరోధానికి 2012లో అప్పటి ప్రభుత్వం పోక్సో చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా బాధితులకు రక్షణ, నేరస్తులను పట్టుకోవడమే కాక వారికి వేసే కఠినతరమైన శిక్షలను పొందుపరిచారన్నారు. బాధితులు తమ ఫిర్యాదులను నమోదు చేయడానికి జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) అధికారిక పోర్టల్‌లో పోక్సో ఈ బాక్స్ బటన్ ఉందని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబరు 15100 తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు, ఒంటిమిట్ట సబ్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, పారా లీగల్ వలంటీర్లు బాలరాజు శివరాజు, శ్రీదేవి, లీలావతి, ప్రతాప్ రెడ్డి, న్యాయవాదులు, ఎన్జీఓలు పాల్గొన్నారు.

23న సాహితీ సదస్సు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ నెల 23న సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 142వ సదస్సును ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల దృశ్య కావ్యం–పర్యాటక విశేషాలు అంశంపై తిరుపతికి చెందిన పాత్రికేయులు ఎ.రాఘవ శర్మ ప్రసంగిస్తారన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు నిమ్మకాయ దీపాలు వెలిగించి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నిర్లక్ష్య ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జమ్మలమడుగు ఏఎస్‌డబ్ల్యూఓ గురుప్రసాద్ స్థానికంగా ఉండకుండా, విధులకు సక్రమంగా హాజరు కాకుండా హాస్టల్స్ పై పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజ్ లు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ జమ్మలమడుగు ఎస్సీ కాలేజి హాస్టల్‌లో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య ఘటనలో హాస్టల్ వార్డెన్, వర్కర్ల నిర్లక్ష్యమే కారణం అని ఆరోపించారు. ఇంత వరకు వారిపై చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు.

కంప్యూటర్ ట్రైనర్ ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: కడప శంకరాపురంలోని అంధుల ఉన్నత పాఠశాలకు చెందిన కంప్యూటర్ ట్రైనర్ కిరణ్మయి హైదరాబాదులో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ టూల్స్ టీం బిల్డింగ్ ట్రైనింగ్‌లో ప్రతిభచాటిందని అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేపరాల ఎబినేజర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధుల పాఠశాలలో ఐ ఆర్ ఐ ఎన్‌జీవో సంస్థ అంధ విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ నిర్వహిస్తుందన్నారు. ఈ నెల 15,16 తేదీలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ టూల్స్ టీం బిల్డింగ్ అంశంపై హైదరాబాదులో రెండు రోజుల శిక్షణ జరిగిందన్నారు. ఈ శిక్షణలో ట్రైనర్ కిరణ్మయి ప్రతిభ చాటిందన్నారు. మంగళవారం హెచ్‌ఎం ఎబినేజర్, స్కూల్ స్టాఫ్ సెక్రటరీ ఆకుల రాజ, లక్ష్మీదేవితోపాటు ఇతర ఉపాధ్యాయులు కిరణ్మయిని అభినందించారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

సుండుపల్లె : ఎండలు అధికంగా ఉన్న కారణంగా పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని వైఎస్‌ఆర్ కడప జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా.కె.గుణశేఖర్‌పిళ్లైలు సూచించారు. మండల పరిధిలోని సొంతంవారిపల్లె గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సహకారంతో మంగళవారం పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు పశువులను చికిత్స కోసం తీసుకువచ్చారు. ఈ వైద్యశిబిరంలో 143 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, 4 నెలల నుంచి 8 నెలల వయసులో ఉన్న 25 దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు, 47 పశువులకు గర్భకోశ పరీక్షలు, 75 పశువులకు సాధారణ చికిత్సలు, 160 పశువులకు బ్యుటాక్స్‌ను పిచికారీ చేశారు. పశువుల పెంపకదారులకు ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయచోటి ఉపసంచాలకులు డా.డి.కొండయ్య, రమణయ్య, డిప్యూటీ డైరెక్టర్ కడప రంగస్వామి, డిప్యూటీ డైరెక్టర్ విపిసి కడప రాజశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ ఏడీడీఎల్ కడప డాక్టర్ సంధ్యారాణి, ఏడీడీఎల్ డాక్టర్ శివరామిరెడ్డి, టి.సుండుపల్లె సహాయ సంచాకులు డా.కె.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తులు పంపిణీ



పాఠశాలలో చిన్నారికి దుస్తులు అందజేస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఎంపీజే జిల్లా అధ్యక్షుడు వి.ఎస్ రహమతుల్లా మంగళవారం నగరంలోని ఉర్దూస్కూలులో నిరుపేద ముస్లింలకు దుస్తులను పంపిణీ చేశారు. చెన్నూరు ప్రభుత్వ ఉర్దూ పాఠశాలకు చెందిన విద్యార్థులను ఇక్కడికి రప్పించి దుస్తులు అందజేశామని తెలిపారు. అలాగే పెద్దలకు కూడా నూతన వస్త్రాలు పంచిపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ జాఫర్ హుసేన్, సి.దస్తగిరిసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, నగదు అందజేస్తున్న సుభాన్‌బాష

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు

నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సుబాన్‌బాష తన కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను అందజేశారు. ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా 21, 30 డివిజన్లకు చెందిన కార్మి కులకు దుస్తులతోపాటు నగదును అందజేశారు.

సరుకులు పంపిణీ

కడప ఎడ్యుకేషన్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పఠాన్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో మంగళవారం 20 పేద కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు. వ్యాపారవేత్త షేక్ అమీన్ హాజరై సరుకులు పంపిణీ చేశారు.



సరుకులు పంపిణీ చేస్తున్న అమీన్ ఖాదర్ బాషా